# కీర్తి కండూతి

హనుమంతుడు బళ్ళో చదువుకునేటప్పుడు సాటి పిల్లలు కాల్చుకు తినేవాళ్ళు. ఇంట్లో తల్లిదండ్రులు కుక్కను చూసినట్లు చూసేవాళ్ళు. హనుమంతుడికి వాళ్ళంటే ఆగ్రహంకన్న అసూయ ఎక్కువగా ఉండేది. తను ఎవర్నీ ఎన్నడూ ఏడిపించలేదు. తనలో లేని ఏవో శక్తులు వాళ్ళలో ఉండబట్టే వాళ్ళు తనని ఏడిపిస్తున్నారు. తాను కూడా అటువంటి శక్తులు సంపాదించాలి. అప్పుడు తన నెవరూ ఏడిపించరు.

ఈ శక్తులను తాను సంపాదించుకొనేదాకా కనీసం ఆత్మరక్షణ అయినా చేసుకోవాలిగా. దానికేమిటి మార్గం? తాను ఉడుక్కుంటే అవతలవాళ్ళు మరింత ఏడిపిస్తారు. అందుకని హనుమంతుడు సహనం నేర్చుకున్నాడు. తాను నోరెత్తినప్పుడల్లా ఇతరులకు చులకనవుతున్నాడు, అందుకని మితభాషిత్వం నేర్చుకున్నాడు. హనుమంతుడికి ఈ రెండూ అలవడినకొద్దీ ఇతరులు వాణ్ణి ఏడిపిం

చటంకూడా తగ్గింది. ఇది చూసి, తనలో ఇంతకాలమూ లోపించిన శక్తులు ఇన్నాళ్ళకు మొలకెత్తాయని హనుమంతుడు భ్రమ పడ్డాడు. నలుగురితోబాటు తాను కూడా తన అభిప్రాయాలు పైకి చెప్పసాగాడు. అందరూ నవ్వసాగారు.

"మూఢులు! వాళ్ళతో మాట్లాడటమే తప్పు!" అనుకున్నాడు హనుమంతుడు. ఆనాటి నుంచీ వాడు ప్రపంచం గురించి తనకుతోచే అభిప్రాయాలను తనలోనే దాచుకోసాగాడు. అప్పుడప్పుడూ వాటిని నెమరువేసుకుని, "ఆహా! నా అభిప్రాయాలెంత రుచిగా ఉంటాయ్! ఇంతమంది సోకాల్డు – గొప్పవాళ్ల మాట్లాడితే వింటాను. ఇన్ని సో – కాల్డు – గొప్ప పుస్తకాలు చదువుతాను – ఎక్కడా ఇంత రుచికరమైన భావాలు కనిపించవే!" అనుకునేవాడు.

కూడబెట్టి దాచుకున్న సొమ్ము ఖర్చుచేసే సొమ్ము కంటె విలువైనదిగా కనబడినట్టుగా, హనుమంతుడు, ఎక్కడా గాలి పొర సోకకుండా తనలో దిగ్బంధం చేసుకున్న భావాలను, పదిమంది బుర్రలూ, సానబట్టే భావాలతో పోల్చి చూసుకుని, తనవే గొప్పగా ఉన్నాయనుకున్నాడు. ఆ భావాలకు పట్టిన కిలమూ, తుప్పూ వగైరాలు వాడికి అమూల్యంగా కనబడ్డాయి. ఆదికాల పురుషులు చెప్పిన అనేక విషయాలకు తన భావాలు ఎంతో దగ్గిరిగా ఉన్నట్టు కనబడి హనుమంతుడికి తానూ ఒక రకం ఋషి అయిఉండా లనిపించింది.

సంఘంలో చలామణి అవుతున్న భావాలూ, సో – కాల్డు – మేధావులు చెప్పే విషయాలూ హనుమంతుడికి క్షుద్రంగా కనపడడానికి మరొక కారణం ఏమంటే చాలామందివాటిని ఆమోదించటం. "సత్యం ఉంది చూశా, అది గొర్రెల మందకి ఎప్పుడూ అందదు. ఎక్కాల పుస్తకంలాంటిదాన్లో ఉండే సత్యంకూడా అసలైన సత్యం కావటానికి వీల్లేదు. రెండు రెండు నాలుగు కాకపోవచ్చునని శంకించినవాడే అసలైన మేధావి. పరమ సత్యాలనుకున్నవన్నీ కాలక్రమాన పేలిపోయాయి. భూమి బల్లపరుపుగా ఉందనుకున్నారు. లేదు. సూర్యుడు భూమి చుట్టూ తిరుగుతున్నట్టు నమ్మారు. కాదు అన్ని పరమ సత్యాలూ ఎవరో ఒకరు పేల్చేస్తారు; అందువల్ల గొప్పవాళ్ళవుతారు. మనమే ఆ పని చెయ్యొచ్చుగా," అని అనుకున్నాడు హనుమంతుడు

అయితే ఒక్కటే చిక్కు వచ్చింది. తాను కూడా పరమ సత్యాలను పేల్చెయ్యగలడు కాని వినే వెధవ లుండాలిగద! ఐన్‌స్టయిన్ గురుత్వాకర్షణ లేదని చెప్పగానే సరా, "భేష్, భేష్" అనే మేధావులు కూడా ఉండాలి. తన మేధావిత్వాన్ని చూసి హర్షించే ఉప మేధావులు దొరికేదాకా తాను నోరు విప్ప రాదు. ఈ గుడ్డి ప్రపంచం ఊకదంపుడు చూసి హర్షిస్తుందిగాని కొత్తభావాలను జీర్ణించుకోలేదు.

హనుమంతు చదువు పూర్తి చేసిన రోజుల్లో వాళ్ళ ఊళ్ళో ఒక భజన పార్టీ ఏర్పడ్డట్టు తెలుసుకున్నాడు. ఈ భజన పార్టీకి నాయకుడూ, నడి నడి బొడ్డూ అయిన ఆసామీ ఒక జాంబవంతుడు. హనుమంతుడు పుట్టక మునుపు నుంచీ జాంబవంతుడు ఆ వూళ్ళోనే ఉంటున్నాడు బజార్లో, కాఫీ హోటళ్ళలో, కిల్లీకొట్టు దగ్గిరా, సినిమా హాలు దగ్గిరా, ఇంకా అనేక చోట్ల హనుమంతుడు జాంబవంతుణ్ణి చూశాడు. కాని ఆయన గొప్పవాడని కలలో కూడా శంకించ లేదు. అకస్మాత్తుగా జాంబవంతుణ్ణి ఊళ్ళో చాలా మంది కుర్రకారు – హనుమంతుడి తోటివాళ్ళు – కీర్తించసాగారు.

"అరె, నువు జాంబవంతుణ్ణి ఎరగవ్వుటా? అద్భుతంలే! కపిలవాయిని ఎంత అద్భుతంగా ఎక్కిరిస్తాడనుకున్నా? అసలు నువు నవ్వుతో మెలికలు తిరిగిపోతావనుకో! అద్భుతంలే! ఎక్కిరిస్తున్నట్టే పాడుతూ కపిలవాయికి జన్మలో పడని సంగతులన్నీ పలికిస్తాడు! అద్భుతంలే!"

"ఒక్క కపిలవాయినేనా? నువు ఒక్క నిమిషం మాట్లాడావనుకో, నిన్ను ఇమిటేట్ చేసేస్తాడు. యడవల్లి నడక ఇమిటేట్ చేస్తాడు గదా – అద్భుతంలే!"

జాంబవంతుడి కీర్తిని గురించి వింటున్నకొద్దీ హనుమంతుడికి ఆశ్చర్యం వేసింది. ఒకరా, ఇద్దరా – డజన్లకొద్దీ యువకులు జాంబవంతుడికి అసాధ్యమైనదిలేదని ఘంటాపథంగా చెబుతున్నారు. తాను జాంబవంతుణ్ణి ఎరగనందుకు ఆశ్చర్యపడుతున్నారు. జాంబవంతుడి పరిచయం ఊళ్లో కుర్రాళ్ళకి మినిమమ్ క్వాలిఫికేషన్ లాగుంది. ఇంత గొప్పవాడి పరిచయం చేసుకుంటే తనకువచ్చే నష్టమేం? హనుమంతుడు ఒకనాడు జాంబవంతుడి భజన సమాజానికి వెళ్లాడు.

"రా బాబాయ్. కూచో! .. అయ్యో! నిన్నింతప్పణ్ణుంచీ ఎరుగుదును. పరిచయ భాగ్యం కలగలేదంతే!" అన్నాడు జాంబవంతుడు. అప్పుడే సుష్టుగా భోంచేసి, పైకి తన్నుకొచ్చే ఆహార పదార్థాలను దిగమింగుతున్న వాడల్లే బరువుగా గుటకలువేస్తూ.

జాంబవంతుణ్ణి చూచిన నిమిషంలోపల హనుమంతుడికి ఆ మనిషిలో గురి కుదిరిపోయింది. "ఎందుకు పిచ్చిన పడతావు? నీకన్న పొడిచేసినవాడెవడూ లేడు. ప్రపంచాన్ని కాస్త పరిశీలనగా చూశావంటే అందరూ నీకంటె వెధవలేనని రుజువవుతుంది," అన్న భావాన్ని, ఆత్మ విశ్వాసాన్ని, హనుమంతుడిలో జాంబవంతుడు ఎట్లా కలిగించాడో కలిగించాడు.

ఎవరైతే ఎందుకో అందుకు గొప్పవాళ్లుగా పరిగణించబడుతున్నారో

వారందరినీ జాంబవంతుడు వెటకారం చేశాడు. ఒకరికి బోసినోరు, ఒకరికి నత్తి, ఒకరికి బట్టతల – మనిషికి ఏదో ఒకటి ఉండకుండా ఉంటుందా? దాన్ని పట్టుకుని అపహాస్యం చెయ్యటం జాంబవంతుడు నేర్చిన విద్య.

జాంబవంతుడికి తెలిసిన మరొక విద్య ఏమిటంటే ఇంకోణ్ణి ఉబ్బేస్తూ తన అంతస్తు పెంచుకోవడం.

ఓరి, నీ తాడు తెగ! అమాయకుడల్లే పైకి కనిపిస్తూ మనవాడు బ్రహ్మ బేద్యమైన మాట ఒక్కటి వదుల్తాడు చూశావా!" అని జాంబవంతుడు ఒక కుర్రాణ్ణి గురించి పక్కవాళ్ళతో అనేసరికల్లా, ఆ మెప్పు పొందినవాడు, రక్తం ఒక్కసారిగా తలకెక్కి, అర నిమిషంసేపు ఊపిరాడకులడా అయిపోయి, తాను బ్రహ్మ బేద్యంగా వదిలిన మాట ఏమిటో తెలియక పోయినా, జాంబవంతుడికి ఆజన్మ దాసుడై పోయి మళ్ళి జన్మలో ఎన్నటికీ ఎప్పటి మనిషి కాలేకపోయేవాడు. ఊళ్ళో జాంబవంతుణ్ణి కీర్తించి భజనచేసి కుర్రాళ్ళంతా జాంబవంతుడిచేత పంపు కొట్టించుకున్నవాళ్ళే.

"ఏం హనుమంతూ? బియ్యే అయింది గామాలు ఏం చేద్దామనుకుంటు న్నావ్? ఈ వెధవ వూళ్లో సెటోటి తెలివైన కుర్రాళ్ళకి చేద్దామన్నా సరైన పని దొరకదే!" అన్నాడు జాంబవంతుడు.

"పని మాట దేవుడెరుగు. నాకు రాయాలనుంది. ఒక నాటకం, ఒక నవల ప్రారంభించా," అన్నాడు హనుమంతుడు. ఇది నిజమేకూడానూ. అయితే ఈ విషయం హనుమంతుడు బ్రహ్మరుద్రాదులకు కూడా తెలియనీకుండా గోప్యంగా వుంచాడు. జాంబవంతుడిలో గల ఏ మహాశక్తి హనుమంతుడిచేత ఇంతమంది మధ్యా ఈ రహస్యం బయటపెట్టించిందో మరి!

"భేష్! నాటకం ముందు ముగించు. కావ్యేషు నాటకం రమ్యం. మనకు అన్నీ ఉన్నాయి గాని నాటకం లేదు గద. ప్రతి చెత్త వెధవా నాటకం రాసే వాడే. ఎంతసేపూ షేక్స్పియర్‌పట్టుకు అహోరిస్తారుగాని ఒక్కడైనా భవభూతి చదివాడూ? లేకపోతే కాళిదాసొకడున్నాడు! వీళ్ళంతా కాళిదాసు శాకుంతలం చదివిచచ్చారా? వీరేశలింగం తర్జుమాయేగా! నువు చెప్పు, ఉత్తర రామచరితం ముందు శాకుంతలం కూడా ఓ నాటకమేనా?" అన్నాడు జాంబవంతుడు.

"ఔనౌను," అన్నాడు హనుమంతుడు. తాను ఆ నాటకాలని సంస్కృతంలో చదివాడని జాంబవంతుడు అనుకున్నందుకు లోపల ఆనందించి, వాటిని వెంటనే సంపాదించి చదవాలని తీర్మానించుకుంటూ. ఇంత కాలానికి ఈ జాంబవంతుడు తనలో వున్న శక్తుల్ని మొలకెత్తించినట్లు గ్రహించి హనుమంతుడు ఇంటికి వెళ్ళాడు.

వాడు వెళ్ళగానే జాంబవంతుడు మిగిలిన వాళ్ళకేసి తిరిగి, "వీడు ఒక నాటకం ఒక నవలా రాస్తున్నానంటాడేమిటి? రెండుచేతులా రాస్తాడా ఏం కొంప తీసి?" అన్నాడు. అందరూ గొల్లున నవ్వారు.

"అది కాదు." అన్నాడు జాంబవంతుడు, తాను నవ్వకుండా. "కాళిదా సెక్కువా, భవభూతి ఎక్కువా అంటే, "నే నేదీ చదవలే"దని యాదవక తల అటికల్లే ఆడిస్తాడేం?" భజన బృందం డొక్కలు నొక్కుకుంటూ నవ్వుతో మెలికలు తిరిగిపోయారు.

కష్టజీవులు అన్నాలు లేక అలమటించేది, దేశ నాయకులు ప్రజలను చైతన్యవంతుల్ని చేసేది, సమ్మెలు జరిగేది, కాల్పులు జరిగేది, ఈ భజన సమాజం ఇదే తీరున వెళ్ళిపోతుంది." ఈ ఉప్పు పాతర్లో ఎన్నో అమూల్యమైన బీజాలు ప్రమాదవశాత్తు వచ్చి పడతాయి. పుచ్చి పోతాయి. ఇక్కడ ఒక్క తృణం కూడా బతకదు. ఇక్కడేదో జీవితమూ, సంస్కారమూ, విజ్ఞానమూ, చైతన్యమూ ఉందనుకుని ఇందులోకి వచ్చి కొంతకాలం ఇదే ప్రపంచంగా గడిపిన యువకులు చవిటివాసన కొడుతూ పైకి వచ్చి, తమలో ఇతరుల బాధలను చూసి సానుభూతి పొందే శక్తీ, ఇతరుల కృషిని అభినందించే శక్తీ, తాము స్వయంగా కృషిచేసే శక్తీ అడుగంటి పోయినట్టు తెలుసుకుంటారు.

హనుమంతుడి ఉప్పుపాతర్లోంచి త్వరలోనే బయటపడ్డాడు. ఎందుకంటే జాంబవంతుడు కొట్టిన పంపుకు, హనుమంతుడికుండిన ఒక రిషా పడిపోయింది. వాడి నాలుక వదులయింది. తాను రాస్తున్న నవల గురించీ, నాటకం గురించీ అందరి ఎదటా కోతలు కొయ్యసాగాడు. అందరూ నవ్వారు. జాంబవంతుడు తనను కూడా అవహేళన చేస్తున్నాడనీ, తనలాగే తల ఆడించి అందర్నీ నవ్వి స్తున్నాడనీ హనుమంతుడికి తెలిసింది. వాడు భజన పార్టీకి స్వస్తి చెప్పాడు. జాంబవంతుడు విచారించలేదు. తన శిష్యులు అవతల తన భజన చెయ్యాలిగాని సొంత డబ్బా కొట్టుకోవటం జాంబవంతుడికి రుచించదు. హనుమంతుడు జాంబ వంతుడి డబ్బా కొట్టలేదు.

హనుమంతుడు రచయిత కావటానికి తీర్మానించాడు వాడికి రచన సులువుగా రాలేదు. రాయటమంటే మాటలతో, భావాలతో ఘర్షణ పడటం, మాటలూ, భావాలూ తమకు గల శక్తులను హనుమంతుడికి ప్రతికూలంగా వినియోగపరుస్తాయి. అందుచేత వాడు రాయటానికి కూర్చున్నప్పుడల్లా ఘోర యుద్ధమయిపోయేది. అట్లాగే కష్టపడి కొద్ది సంవత్సరాల కాలంలోనే వాడు అయిదారు కథలు, రెండు నాటకాలు, అయిదారు నాటికలు, పది పన్నెండు పద్యాలు రాశాడు.

ఈ రాయటంలో గల చిత్రమేమిటంటే తాసీరచనలు ఎందుకు చేస్తున్నదీ హనుమంతుడికి స్పష్టంగా తెలీదు. వాటిని వాడు ఒకరికి చూపలేదు, ఒక పత్రికకు పంపలేదు. వాటిని గురించి ఒకరితో చెప్పలేదు. వాటి గొప్పతనం గురించి వాడికి యత్కించిత్తు సందేహం ఉండికాదు; తాను నోరు చేసుకుని ఏ మాట అన్నా అది తప్పక బెడిసికొడుతుందనే భయంతో, ఈ రచనలగురించి చిన్నప్పటి సహనమూ, మౌనమూ అవలంబించటంతప్ప వాడికి మార్గం కనిపించ లేదు.

ఇంతలో వాడు వాళ్ళబావమరిది ఊరు వెళ్ళటం జరిగింది. ఈ బావమరిది పత్రికలంటేనూ, రచయితలంటేనూ ఆసక్తి కలవాడు. ఒకరోజు ఏదో పత్రికలో ఒక కథ చూపించి "ఈ కథ చూడు, బావా, ఎంత బాగుందో" అన్నాడు హనుమంతుడితో బావమరిది. హనుమంతుడు ఆ కథ చదివి దాన్ని గురించి ఏమీ అనకుండా, "నీ కిట్టాంటి కథలు నచ్చుతాయల్లే ఉంది. ఇది కాస్త చదివి చూస్తా?" అంటూ తన ట్రంకుపెట్టెలో నుంచి "తప్పటడుగులు" అనే కథ, తాను రాసినదే తీసి చూపించాడు.

అది హనుమంతుడు రాసిన కథే అని తెలిసి బావమరిది దాన్ని శ్రద్ధగా చదివాడు. ఎడారి అనుకున్నచోట జల కనిపిస్తే ఆనందంగా ఉండదూ? "చాలా బాగుంది, బావా? ఎప్పుడు రాశావేం?" అన్నాడు బావమరిది.

"నువ్వూ బాగానే వుందన్నా, నేనూ బాగుందనే అనుకున్నాలే?" అంటూ హనుమంతుడు కథ తీసుకుని పెట్టెలో పెట్టేశాడు. ఆ ప్రస్తావన అక్కడితో ముగిస్తు.

"ఏం చేస్తావు దాన్ని?" అన్నాడు బావమరిది.

"చేసేందుకేముందీ?" రెండేళ్ళ నుంచీ పెట్టెలో పడివుంది. ఉణ్ణీ!"

"ఛ, ఏదన్నా పత్రిక్కి పంపించు బావా!"

"ఏ పత్రిక వేసుకుంటుందీ?"

"ఏ పత్రికన్నా వేసుకుంటుంది."

"అయితే అదేదో నువ్వే చూసి పంపించు. ఏం చెయ్యాలో నాకు తెలీదులే."

ఆ రోజే "తప్పటడుగులు" పత్రికకు వెళ్ళిపోయింది.

"పోస్టు ఖర్చు ఎంతయిందో తీసుకో!" అన్నాడు హనుమంతుడు.

"ఇయ్యదలిస్తే ముక్కాని[1]య్యి!" అన్నాడు బావమరిది నవ్వుతూ.

హనుమంతుడు ముక్కానియ్యటంలో గల చమత్కారం కూడా అర్థం

---

1. ముక్కాని = మూడు కానులు.

చేసుకోలేదు. "కథను ముక్కాని బిళ్ళతో పంపించా? చేరుతుందీ? రిజిష్టరీ అయినా చేసి తగలెయ్యక పోయినా? అది పోతే మళ్ళీ రాసియాడవలేనే!" అన్నాడు.

బావమరిది నవ్వు హనుమంతుడి భయాన్ని ఏ మాత్రమూ తీర్చకపోగా రెచ్చగొట్టింది.

ఆ రోజు లగాయతు హనుమంతుడు పత్రిక కోసం రోజులు లెక్కపెట్ట సాగాడు. పైకి మాత్రం తన ఆత్రం ఏ మాత్రమూ కనిపించనివ్వ లేదు. నెలాఖరున పత్రిక వచ్చింది. అందులో కథ లేదు. "నా కథ నీ పత్రికలో పళ్ళేదు గాని, వాళ్ళని ఆ కథ కాస్త తిప్పి పంపించమని కార్డుముక్క రాయి" అని బావమరిదికి రాశాడు. తన రచనలను ఎవరూ ఆదరించకపోతే హనుమంతుడు ఏ మాత్రమూ ఆశ్చర్యపడదలచలేదు.

అయినా మరుసటి మాసంలో కథ అచ్చయింది. హనుమంతుడు తన సంతోషాన్ని పైకి తెలియనియ్యలేదు. హనుమంతుడి తొలి కీర్తికిరణం ప్రపంచం మీద పడింది. ఆ కథ కొందర్ని ఆకర్షించటానికి ప్రధాన కారణం భాషలోనూ, కథనంలోనూ గల ప్రత్యేకత. హనుమంతుడిమీద సమకాలిక రచయితల ప్రభావం ఆవగింజంత కూడా లేదు, ఎందుకంటే వాడెవరి రచనలూ ఆసక్తితో చదవలేదు. చాలామంది రచనలు అసలు చూడనైనా లేదు. వాడి శైలే వేరు. వాడు వాడిన పదజాలం కూడా వేరే. ఇదే చాలామందిని ఆకర్షించింది.

"ఏమండీ, మీరు ఏ పట్నంలో పత్రిక్కో కథలు పంపిస్తారు. ఊళ్ళో పత్రిక్క ప్రోత్సాహం ఇవ్వరు. ఇదేం బాగాలేదు." అన్నాడు ఆ వూళ్ళో పత్రిక ఒకటి నడుపుతున్న ఆసామి.

"కావలిస్తే నువ్వా ఒక నాటిక తీసుకో. నే వద్దన్నానూ. అయితే వేసుకుంటానంటేనే యిస్తా. లేకపోతే ఇవ్వను. తీనుకెళ్ళి పారేస్తే నేను మళ్ళీ రాని చావలేను. మూడు నెల్లు కష్టపడి రాసిన నాటిక." అన్నాడు హనుమంతుడు.

ఆ నాటిక కూడా అచ్చయింది. అచ్చయిన నెలకి కొందరు విద్యార్థులు వచ్చి, "ఏమండీ, మీ నాటిక ఆడుకుంటాం. పర్మిషన్ ఇవ్వండి." అని అడిగారు.

"ఇదుగో, ఆడితే ఆడారుగాని, నే చెప్పినట్టు ఆడండి. దాన్ని మీ యిష్టం వచ్చినట్టు ఆడితే ఏమీ బాగుండదు." అన్నాడు హనుమంతుడు. గొప్ప నాటక కర్తలంతా తమ నాటకాలను స్వయంగా దగ్గిర ఉండి ఆడిస్తారని వాడు విన్నాడు.

కుర్రాళ్ళు నాటకం ఆడారు. ప్రేక్షకులు ఆనందించారు. ఒక పెద్దమనిషి

హనుమంతుడి దగ్గిరకొచ్చి, "మొత్తంమీద కుర్రాళ్ళచేత మంచి నాటకం ఆడించారే?" అన్నాడు.

"నువ్వూ ఆ మాటే అన్నావ్? నేను అదే అనుకున్నా. అయినా కుర్రాళ్ళు, వాళ్ళకు చాతనయినంత చేశారు. బాగా ఆడేవాళ్ళుంటే ఇంకా బాగుండాలిసింది కాదూ?" అన్నాడు హనుమంతుడు.

సినిమాల్లో కథానాయిక పాతివ్రత్యం చిట్టచివరకు అన్ని కష్టాలను జయించినట్టుగా, హనుమంతుడి ఓర్పు ఇంతకాలానికి ఫలించి, వాడి కీర్తి కాస్త కదలబారింది. అందులో వేగం లేనిమాట నిజమే. వాడికన్న చాలా ఆలస్యంగా రచనలు ప్రారంభించి అవ్వాయిచువ్వలల్లే క్షణంలో పైకి వచ్చిన కుర్రాళ్ళున్న మాట కూడా నిజమే. కాని ఏమీలేనిదానికన్న ఇది నయమే కద. హనుమంతుడుకూడా ఒక రచయితేనన్నది నలుగురికి కాకపోతే ఇద్దరికైనా తెలిసింది.

ఆ మాటకొస్తే హనుమంతుడు రాసిందంతా కలిపి ఎంత? ఈ మాటే ఎవరో ఒకరన్నారు: "ఈ చలం, ధనికొండ, కుటుంబరావు చూశారు ఎంతెంత ఉత్పత్తి చేశారో? మీరు చాలా నింపాదిగా రాస్తారల్లే వుందే?"

"ఏమోనబ్బా! రాసి బళ్ళకెత్తటం మనకి చాతకాదు. అయినా ఎందుకొచ్చింది? నన్నిట్టా బతకనీ!" అన్నాడు హనుమంతుడు. వాడు ఇతర రచయితలతో పోటీకి రాకపోవటం ఒక విశిష్టత కింద జమ అయింది.

ఇంతలో అభ్యుదయ సాహిత్యోద్యమం వచ్చింది. హనుమంతుణ్ణి తట్టి పిలిచింది. నిజానికి హనుమంతుడికి ఏ ఉద్యమమూ ఇష్టం లేదు. అన్ని ఉద్యమాలూ వ్యక్తిని మింగేసి ఉద్యమాన్ని నడిపేవాళ్ళని పైకి తోస్తాయి. జాతీయోద్యమంలో కూడా అనేక లక్షలమంది త్యాగంచేసి అనామకులైపోగా నాయకులు కీర్తి సంపాదించుకున్నారు. ఉద్యమాలను గురించి హనుమంతుడికి ఉద్దేశం అదీ. ఎవడికి వాడే ఉద్యమం! అందుకే హనుమంతుడు నవ్యసాహిత్య పరిషత్తు చాయలకు కూడా పోలేదు.

ఆ మాటకువస్తే హనుమంతుడు అభ్యుదయ సాహిత్యోద్యమం చాయలకు కూడా పోలేదు. ఒకానొక వ్యక్తి రూపంలో ఆ ఉద్యమమే హనుమంతుణ్ణి వెతుక్కుంటూ వచ్చింది.

"మీరు రాసిన "తప్పటడుగులు" కథ చదివాను. అది అభ్యుదయ రచనే," అన్నాడీ వ్యక్తి.

"అంటే ఏమిటో నాకు తెలియదే!" అన్నాడు హనుమంతుడు.

ఆ వ్యక్తి సాహిత్య పరమార్థం గురించీ, సంఘ పురోభివృద్ధిని గురించీ

ప్రజా జీవిత పరిణామం గురించీ, ఆ పరిణామం సాధించటంలో కళలు నిర్వహించవలసిన పాత్ర గురించీ చాలా సేపు మాట్లాడాడు.

హనుమంతుడు అంతా విన్నాడు; ఆ వ్యక్తితో ఏకీభవించనూ లేదు. వ్యతిరేకించనూ లేదు.

"ఏమిటి మరి? మీరు అభ్యుదయ రచయితల సంఘంలో చేరి ఈ ఉద్యమాన్ని నడిపించాలి," అన్నాడా వ్యక్తి.

"ఉద్యమాన్ని ఒకరు నడిపించేదేమిటి? అదే నడుస్తుంది" అన్నాడు హనుమంతుడు.

"మీరు అభ్యుదయ రచనలు చేస్తే నడుస్తుంది."

"నాది అభ్యుదయ రచనే నంటివిగా?

"దానికేం సందేహం లేదు. అలాటివి ఇంకా మీ చేతిమీదిగా చాలారావాలి, పత్రిక ఒకటి పెడుతున్నాం. నెల నెలా మీరు రాయాలి."

"అబ్బో! అదే మనవల్ల కాదు. రాయాలనిపించినప్పుడు రాస్తా. నీకే పంపిస్తా. నచ్చితే వేసుకో - నచ్చకపోతే మళ్ళీ నా మొహాన కొట్టు."

"ఆత్మరక్షణకోసం అట్లా అన్నాడే గాని ఎట్లా రాస్తే అభ్యుదయ రచన అవుతుందో హనుమంతుడికి ఉజ్జాయింపుగా తెలిసింది. "భవిష్యత్తు వెనకపడిన వారిది[1], ముందు రాబోయేవారిది, పిల్లలది!" అని అవ్యక్తి అన్నమాటలు మూడూ హనుమంతుడి తలలో అంటుకున్నాయి.

మరో నాలుగైదు మాసాలలోగా హనుమంతుడు నాలుగైదు పేజీల కథ ఒకటి రాసి పంపాడు. అది అభ్యుదయ రచనగా అచ్చయింది.

"కథ సరి అయిన ధోరణిలోనే ఉంది చాలాబాగుంది. చదివినవాళ్ళంతా ఆ మాటే అన్నారు." అన్నాడా వ్యక్తి హనుమంతుడితో.

"అన్నారూ? నేనూ అదే అనుకున్నా!" అన్నాడు హనుమంతుడు.

ఇదే విధంగా హనుమంతుడు అభ్యుదయ సాహిత్యోద్యమానికి ఇంకా రెండు మూడు రచనలు సమర్పించాడు. కాని వాడు అభ్యుదయ సాహిత్య సిద్ధాంతాలను అర్థం చేసుకున్నాడని గాని, బలపరిచాడని గాని ఎవరన్నా అనుకుంటే అది హనుమంతుడి తప్పు కాదు, అనుకున్నవాళ్ళ తప్పు. ఆ ఉద్యమంలో ఇంకా చాలామంది రచయిత లున్నారు, రచనలు చేశారు, వాటిని హనుమంతుడు శ్రద్ధగా చదవలేదు. దారి తప్పి చదివితే, అది ఉద్యమాన్ని ఎంతవరకు బలపరుస్తున్నదో, ఎంతవరకు బలహీనపరుస్తున్నదో ఆలోచించలేదు.

అభ్యుదయ సాహిత్యం దాకా పోనవసరంలేదు. అసలు సాహిత్యం గురించే హనుమంతుడెన్నడూ ఆలోచించలేదు. దేశంలో రచనల ద్వారా పేరు తెచ్చుకుంటున్న ప్రతి ఒక్కడి మీదా హనుమంతుడికి పట్టరాని అసూయవుంది.

---

1. భవిష్యత్తు వెనకపడినవారిది 'కాదు' అని ఉండి ఉండాలి. (సం.)

వాళ్ళంతా పొడిచేస్తున్నదేమీ లేదని హనుమంతుడికి దృఢ విశ్వాసం. అందుకు గాను వాళ్ళ రచనలు చదవాలిసిన అవసరం కూడా లేదు.

హనుమంతుడు అభ్యుదయ సాహిత్యోద్యమంపట్ల తామరాకు మీది నీటి బొట్టులాగా వున్నా, ఆ ఉద్యమం హనుమంతుణ్ణి రచయితల జాబితాలో చేర్చిన మాట నిజమే. ఉద్యమం మూలంగా హనుమంతుడు పేరు తెచ్చుకున్న పలుకుబడి కేవలం రచనల ద్వారా ఒక్కనాటికి వచ్చివుండదు. అందుకనేనేమో అభ్యుదయ సాహిత్యోద్యమం ద్వారా పేరు బాగా పైకి వచ్చినవారంటే హనుమంతుడికి ప్రత్యేకమైన మంట. వాడు దీన్ని కడుపులోనే ఉంచుకున్నాడు.

రానురాను అభ్యుదయ సాహిత్యోద్యమం సన్నగిల్లిపోయింది. ఉద్యమంలో ప్రతిష్ఠంభన ఏర్పడింది. ఇందువల్ల హనుమంతుడికి చీమ కుట్టినంత బాధకూడా కలగలేదు సరిగదా, ఏపాటో ఆనందమే కలిగింది. "ఉద్యమం ఆధారంతో తాడి ప్రమాణంగా లేచిన వెధవలంతా ఠపీమని కింద పడిపోతారు!" అనుకున్నాడు. ఆ జాబితాలో తాను కూడా చేరవచ్చునని హనుమంతుడికి తట్టలేదు. రచనలతో పైకి వచ్చిన వాళ్లెవరూ, ఉద్యమం తీయగానే దిగిపోలేదు. హనుమంతుడి సాహిత్య జీవితం మాత్రం తుదముట్టింది.

దాంతోనే హనుమంతుడికి ఒకవిధమైన రుగ్మత పట్టుకుంది. ఉన్నట్టుండి ఒక మంచిరోజున సాహిత్య దూషణ ప్రారంభించాడు. మొదటి ప్రపంచ యుద్ధం ముగిసిన నాటినుండీ నేటివరకూ వచ్చిన ఆధునిక కవులందర్నీ, ఏ సిద్ధాంతాన్నీ ఆచరించకుండానే బండబూతులు తిడుతూ దీర్ఘమైన వ్యాసాలు రాశాడు. తెలుగు వాఙ్మయానికి చిరకాలంగా తీరని సేవచేస్తున్న మోతుబరులు ఈ బండబూతులను అచ్చువేసి తమ సంస్కృతిని బయటపెట్టుకున్నారు.

కొద్ది రోజులు పోనిచ్చి హనుమంతుడు ఇవే తిట్లను పద్య రూపంలో మళ్ళీ నెమరేశాడు. వాటిని కూడా అచ్చు వేశారు. తరవాత నాటకరూపంలో రాశాడు. అదీ అచ్చు అయింది. బుర్ర కథ రూపంలో రాద్దామనుకుంటుండగా ఆంధ్రకు ఎన్నికలు వచ్చాయి. ఎన్నికల జాతర కొలువులకు పీరంగం వెయ్యటానికి జనం ముందుకు దూకారు. హనుమంతుడుకూడా దూకాడు. రాజకీయ వాదులంతా ఒకరి కొకరు తారు పూస్తుంటే ఈసందడిలో హనుమంతుడు, సదరుగా కనబడిన రచయితలకు తారు పుయ్యసాగాడు.

"ఈ హనుమంతుడి కీ జబ్బేమిటి?" అన్నాను ఒక మిత్రుడితో.

"అణిచి పెట్టిన రోగాలు ప్రమాదకరంగా పరిణమిస్తాయి. ఇది అణిచి పెట్టిన కీర్తిదాహమూ కీర్తికండూతినూ!" అన్నాడు నామిత్రుడు.

[ముద్రణ: ఆంధ్రజ్యోతి (మాసపత్రిక) ఫిబ్రవరి 1955]